# అచల

చిత్రాలమీద వచ్చిన డబ్బు కాన్వాసుకీ, టీకీ, సిగరెట్లకే చాలదు. ఇరువయి నాలుగు గంటలూ పార్కు వేపుకి కూడా పోవటానికి లేకుండా యింట్లోనే కూర్చోమంటాడు వినోదబాబు. చిన్ననాటి స్వప్నాలు తీరని అచల, వీరాజీతో ఏమంటుందో వినండి.

'కాళ్ళక్రింద సుళ్ళు తిరిగిపోయే ఇసుక తీరం కన్నా అలలు రోషంతో కరిగిద్దామని ప్రయత్నించినా కరగని రాళ్ళ తీరమే ఆకర్షిస్తోంది నన్ను' అన్నది అచల, ఒక రాతిబండ మీద కూర్చుని కాళ్ళు సముద్రపు నీటిలో ఆడిస్తూ, వీరాజీతో.

సంధ్య చీకట్లలో నల్లబడపోతున్న సముద్రపు అలలు దూరదూరం నుండీ ఈ రాళ్ళను తమలోకి కదుల్చుకోవాలనే తాపత్రయంతో వురకలతో నురగలు క్రక్కుకుంటూ రాళ్ళ మీదకి వచ్చి ఛిద్రమవుతున్నయ్ !

'ఈ నురగలు క్రక్కుతున్న అలలను చూస్తూంటే, తాము పగపట్టిన మనిషిని చంపలేక తల బ్రద్దలు కొట్టుకునే నల్లత్రాచులు జ్ఞాపకం రావటంలేదూ ?' అన్నది మళ్ళీ అచల. వీరాజీ అచల ముఖంలోకి సూటిగా చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు.

'నీ సౌందర్యం ఎంత మృదువుగా, ఆకర్షణగా వుంటుందో, నీ భావాలు అంత కర్ణకఠోరంగా వున్నయ్. చల్లని సాగరతీరంలో హాయిగా ఆలోచించాల్సిన సమయంలో నీకు క్రౌచులు ఎందుకు జ్ఞాపకానికి రావాలీ? నువ్వు నిజంగా 'నాగినీ' జాతి దానివే! సందేహంలేదు. ఇంత కోమల మూర్తిలో ఎంత ద్వేషం, పగా రాజుకుంటాయ్?' అన్నాడు వీరాజీ, ఖద్దరు సిల్కు లాల్చీ జేబులోంచి సిగరెట్ కేస్, లైటరూ తీస్తూ.

అచల తనకేసి చూడకుండా చేయి జాపింది.

'ఊఁహూఁ! ఇది అలవాటు అయినా, నీ పెదిమలు సహజ సౌకుమార్యాన్ని వదలలేదంటే ఆశ్చర్యమే మాకు!' అన్నాడు సన్నగా వంపుతిరిగి 'లిప్‌స్టిక్' వేయబడిన పెదాల వంక చూస్తూ.

ఆమె జాలిగా నవ్వింది.

'అందుకే నేను ఎప్పుడూ లిప్‌స్టిక్ వేయకుండా వుండను. వేయకుండా కనిపిస్తే ఇంకేమన్నా వుందా? నేరేడు పండు ఛాయకు వచ్చేస్తాయ్. కవులేమో దానిమ్మ పూరేకలా వుండాలంటారు మరీ! అసలు వినోదుతో వున్నప్పుడు అలవాటయింది నాకు. అతను గంటల తరబడి నా చిత్రాన్ని వేస్తూ కూర్చునేవాడు. నాకు మాట్లాడకుండా తోచదు. అతను చెయిన్ స్మోకర్. 'షాసింగుషో'యేలే! నేనూ పకట్ తీసుకుంటూండేదాన్ని. నా చిన్నప్పుడు మా అమ్మ 'చుట్టలు' కాల్చేది' అన్నది. చెప్పేటప్పుడు ఆమె ముఖంలోని నిర్లజ్జను

చూసి వీరాజీ ఆలోచనలో పడిపోయేడు. తను పనివుండి లోపలికి వెళ్తే ఈ వయస్సులో కూడా నెత్తిమీదకు చీర చెరగు లాక్కుని లేచినుంచునే భార్య, పట్టులాంటిజుట్టు ఎగురు తున్నా లక్ష్యపెట్టకుండా కారులో సరసను ప్రయాణించే ఈ వనితకూ గల తారతమ్యము సుబోధకం అవటంలేదు. ఏదో తెలివి ఈ స్త్రీలో! అయినా అందుబాటులో వుండే ఆకర్షణ.

ఆ రోజు అయిదు నిమిషాలు తన మనస్సు, శరీరం అచేతన మయ్యాయ్! తెలియని వూహలు దోబూచు లాడాయ్! వినోదుకుమార్ రాయ్ ఎగ్జిబిషనులో తన వర్ణ చిత్రం దగ్గర నిలబడి తదేకంగా చూస్తున్న వీరాజీని అచల క్షణంలో అవగతం చేసుకున్నది. వినోదుతో ఏదో చెప్పింది...

'మీకు ఈ చిత్రం కావాలా సర్కార్?' అన్నాడు, వినోదు.

'అవును. మేము ఖరీదుచేస్తాము.' చెప్పు మీవారితో' అన్నాడు వీరాజీ. హాలులో ఓ వారగా శుద్ధమయిన బెంగాలీ కులస్త్రీలా చేరెడు వెడల్పు అంచు చీరకట్టుకుని వెడల్పయిన నుదుటిమీద సిందూరంతో నిలబడివున్న అచలకేసి చూస్తూ. వినోదు అచలదగ్గర కెళ్ళి ఏదో గొణిగాడు. 'వూఁ హుఁ వూఁ హుఁ' అంటోంది అచల.

'ఏమీ? అమ్మదల్చుకోలేదా? మాకు ఆలస్యం అవుతున్నది' అన్నాడు.

అచల సర్రుమని వచ్చింది దగ్గరగా.

'దీని ఖరీదు అయిదు వందలు' అంది, కఠినంగా అరిచి నట్లుగా.

'అయిదువంద లయితేనేం, వేలయితేనేం? కొనదల్చు కున్నప్పుడు?' అన్నాడు గంభీరంగా, మెడలోని మూడు వర సల ముత్యాలహారాన్ని సవరించుకుంటూ.

అచల ఇంకా దగ్గరగా వచ్చి అతన్ని పరీక్షించింది. పట్టు షెర్వానీ, చెవుల రవ్వల కమ్మలు, నుదుట గంధం బొట్టు, మెడలో ముత్యాల సరాలు, చేతిలో చిన్న దంతపు పికారు కర్ర, అతనో జమీందారని ధృవపరచాయ్.

నెమ్మదిగా నవ్వింది - మైనం గోరువంకలా!

'అంత బాగుందా వర్ణచిత్రం బాబుజీ?' అన్నది, సన్నగా తన మాట తనకే వినబడనట్లుగా.

వీరాజీ ఆమెలోనికి చూశాడు. ఈమె కులస్త్రీ కాదని పసికట్టాడు.

'ఆహాఁ! చాలా బాగుంది. ఈ చిత్రంలోని యువతి సజీవమై యున్నట్లయితే నేను తప్పకుండా బ్రహ్మను గూర్చి తపస్సు ప్రారంభిస్తాను' అన్నాడు, కనుకొలకుల చివర, నుదుటి మీద ముడుతలు పడేలా నవ్వుతూ.

అతని ఎత్తయిన ఆకారాన్ని చూస్తూ అచల దీర్ఘ నిశ్వాసం విడిచింది. హాలు గుమ్మందాకా చరచరా నడిచి గేటు ప్రక్కగా పార్కు చేయబడిన అతని కారును చూస్తూ నిలబడిపోయింది. అస్తమయ సూర్యకిరణాలు నల్లని కళ్ళల్లోకి

సూటిగా దూసుకు వస్తూ ఆమె కళ్ళను మూసుకునేట్టు చేశాయ్. నెమ్మది నెమ్మదిగా కనురెప్పలు తడిసి భారమై పోగా చెట్ల నీడల్లోనికి గబగబా నడిచి వెళ్ళిపోయింది.

'ఈమె ఎవరూ?' అన్నాడు వీరాజీ. మాసిన చేతులు గల లాల్చీ తొడుక్కున్న వినోదుతో. 'శ్రీమతి వినోద్ కుమార్ రాయ్' అన్నాడు, ఎర్రగా, చురుగ్గాచూస్తూ. మొగలి డొంకల్లో జారిపడ్డట్టయింది శ్రీ శ్రీ శ్రీ వీరాజీ ప్రతాప్ సింహాజీకి!...

'జీవన ప్రభాత్' కావ్య సంపుటికి సన్మానం పొంది టాంగాలో ఇంటికి వస్తూన్న 'సంజయ' బస్సు స్టాపులో క్యూలో నిలబడ్డ అచలను చూసి, దిగిరాను దిగిరాను దివి నుండి భువికి, అని మనస్సులో మననంచేసుకున్నాడు. ఆ దివ్య మూర్తిమీద పది ఖండకావ్యాలు వ్రాశాక ఒక వుషో దయాన్న సన్నటి జల్లులో బట్టల షాపులో కనపడింది అతని కావ్యసుందరి!

మంచులా అయిపోయాడు సంజయ. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ షాపులో అడుగుపెడుతున్న అతన్ని జూసి ఆహ్వానిస్తున్నట్లుగా మందస్మితం చేస్తూ,

'ఏం కావాలి?' అన్నది.

పలుచటి లేత మబ్బురంగు సిల్కు చీర చుట్టూ ఆకు పచ్చంచులో జరీ లతలు, చీర నిలువుకూ జరీ చారలు, అది తీసి చూస్తున్నట్లుగా చూస్తూ, ఆమెకేసి ఓరగా చూశాడు.

'అదృష్టవంతురాలు, ఎవరో?' అనుకున్నది అచల. కౌంటరు వద్దకు వెళ్ళి వెల అడిగి వచ్చింది.

'నూటి ఇరవై !' అన్నది, లాలిత్యం ఒలకబోస్తూ. ఆ చీరను తనే కట్టుకున్నట్లుగా అద్దం ముందు నిల్చుని తన సౌందర్యాన్ని చూసుకుంటున్నట్లు భావించి ఆమె కన్నులు అరమూతలు పడ్డాయ్. ఆమె కట్టుకున్న సాదా తెల్ల చీరనూ, తెల్లగా అరటిదూటలాంటి మెడ వెనుకగా నల్లగా ఒత్తుగా సాఫీగా జారుతున్న జుట్టు కేసి ఆహ్లాదంగా చూస్తూ :

'వెల ఎంత ?' అన్నాడు, సంజయ.

'ఒక సున్నితమైన హృదయం !' ఆమె కళ్ళు గట్టిగా మూసికొన్నది. సంజయ స్వేచ్ఛగా వూపిరి పీల్చి హాయిగా నవ్వుతూ, చీర ఆమె చేతుల్లో పెట్టి కౌంటరు దగ్గర కెళ్ళి ఖరీదు చెల్లించి, రశీదు ఆమె గుప్పెట్లో పెట్టాడు. ఆమె కన్నులు కలకల్లాడాయ్ !

'నిన్ను నా ప్రాణప్రదంగా ప్రేమిస్తున్నాను అంచల్! మనది పవిత్ర ప్రేమ. మనజీవితాలు వెన్నెలబాటలో నవ్వుల పంటగా సాగిపోతయి. నువ్వు నామనోన్మణివి!' పార్కు రేడియోలోంచి దూరంగా సన్నగా 'ఛుఫీహై కహాఁ?' పాట వినవస్తోంది.

'నా దీనస్థితికి మీ హృదయం ద్రవించి వుంటుంది. ఒక స్త్రీ స్వయంపోషకురాలుగా వున్న సహించలేరు పురుషులు. దీనికి పవిత్ర ప్రేమ అనఖ్ఖర్లేదు. ఆమాటవింటే నా శరీరం అగ్నిజ్వాలల్లో దగ్ధమౌతున్నట్లు వుంటుంది' అన్నది అచల ఆకాశంలో ఎగిరే గ్రద్దలనుచూస్తూ.

'నీవు నన్ను ప్రేమించలేవా అంచల్?' ఆదుర్దాగా అడిగాడు.

'హుఁ! మీరు నిజంగా కవీశ్వరులేనండీ? ప్రేమ! ప్రేమట! ఎక్కడవుంది? ఎలావుంది? మీరు నన్ను పోషించగలిగినన్నాళ్ళూ నాక్కావల్సినవి సమకూర్చగలిగినన్నాళ్ళూ మిమ్మల్ని వొదిలివెళ్ళను. ఆమాట మాత్రం నిశ్చయం.' గలగలా నవ్వుతూ అతని 'ఆదర్శమహిళ' నవల పేజీలను టపటపా తిరగేసింది. సంజయుకు ఏదో బాధ అనిపించింది. 'ఆమె ఏదో దాస్తున్నది. ఎవ్వరూ తెలుసుకోలేని నిజాలను నేను తెల్సుకున్ని సానుభూతి చూపాలి' అని ఆరాటపడింది కవిహృదయం.

'అసలు నువ్వెల్లా వచ్చావ్ అంచల్? నాకుమాత్రం నా కోసరమే ఏదో దివ్యలోకాలనుండి తేలి వచ్చావనిపిస్తున్నది అంచల్!'

'చెపితే వింటారా? విని సహిస్తారా? సహిస్తూకూడా పవిత్రంగా ప్రేమిస్తారా?' మనస్సు వికలమైపోగా జలపాతప్పు హోరులా నవ్వసాగింది.

'అబ్బబ్బ! ఏమిటి అంచల్! పిచ్చిదానిలా? నేను నిన్ను మనస్ఫూర్తిగా నమ్ముతున్నానని చెప్పలేదూ?'

'ఏం నమ్మారూ? నేను ఒక పెళ్ళికాని స్త్రీనోని. వూరూరూ వుద్యోగార్థినై తిరుగుతూ ఈ పట్నంలో బట్టల షాపులో వుద్యోగంలో చేరానని చెప్పితే మీరు తృప్తిపడతారు. అది నేనూ కాదనను లెండి. మీరు వూహించుకున్న పవిత్రతను గంగలోత్రోసి మిమ్మల్ని దూరంచేసుకోవాలన్న దురూహ నాకింకాలేదు.'

ఆమె ముగ్ధ సౌందర్యాన్ని ఆశ్చర్యంతో చూస్తూ తలలో పాటలు అల్లుకుంటూ కూర్చుండి పోయాడు సంజయ...

రైలు బయలుదేరేప్పుడు కలిగిన కుదుపుకు కళ్ళువిప్పి చూసింది అచల. ఎదురు బెర్తుమీదగంటక్రితందాకా ఎడ్గార్ వాలెస్ నవల చదువుకుంటున్న సూటు వాలా ఎవరా అని ఆమె మనస్సు ఆలోచించింది. ఇంతలో ఏమయ్యాడుమళ్ళీ? తనూ 'వి. టి.' దాకా వస్తానన్నాడే? – అనుకుంది. ఏమిటో వంట్లో నీరసంగా ఆకలిగావుంది. లిల్లీ కయితే మరీను. తన దగ్గర పాలులేవు. పాలడబ్బా అసలే లేదు. అది తెల్లకుండేలు పిల్లలా ముడుచుకు పడుకుంది. పొట్ట వెన్నుకంటుకుపోయింది. తనేంచేయగలదూ? 'నిన్ను పవిత్రంగా ప్రేమిస్తున్నాను అచలా' అనేవాడు శర్మ. ప్రేమకు ఫలితం కలగగానే సంఘ మర్యాదలు కావల్సివచ్చాయ్. తనకేంతెల్సునూ ఇంత గాఢ ప్రేమికుడని! ఒక పౌడరు డబ్బా, షిఫాన్ చీరతో ప్రేమను కొనుక్కున్నాడు. తనవంటి సౌందర్య రాశికి రోజుకి రెండు రూపాయలు మిగల్చలేని భర్తని అంటకట్టిన తల్లిదండ్రుల ననాలి. అందం విలువ తెలిసిన ఆడవాళ్ళు, వాళ్ళకి సరయిన పోషణ జరగటంలేదనిగుర్తించినప్పుడు, ప్రక్కదారులలో నడ వటం సహజం! వాళ్ళు కేవలం అందంమీద ఆధారపడి, సంఘంలో వున్నతంగా మసలగలగాలని తాపత్రయపడతారు. ఇంట్లో స్తోమతువుండదు. వాళ్ళకీ తినటానికి అయిస్క్రీములూ, తిరగటానికి కార్లూ కావాలి. అవి సవ్యంగా లభించనప్పుడు లోకానికి ఎదురీత ప్రారంభిస్తారు. ఎవరేమనుకుంటేఏం?–అనే

మొండితనంలో పడిపోతారు. వాళ్ళకి కావల్సినవి సక్రమమైన మార్గంలో లభిస్తే వాళ్ళకి ఈ చాటు బ్రతుకు ఎందుకు? మెయిన్ రోడ్డులో నడువనిస్తే మురికిసందుల్లో దూరేవారుం టారా? మెడికలు స్టూడెంటు శర్మ పవిత్రప్రేమ విలువ అచ లకు తెలియనిదికాదు. అయినా అతన్ని జేరనియ్యటంలో ఆమెకు తప్పుకనబడలేదు. లిల్లీ కలగగానే ఆమె కొంచెం చలించింది. తన చిన్నతనం గుర్తుకువచ్చింది. అమ్మ ఎప్పుడూ తన చెంపలు నిమురుతూ :

'నువ్వు కార్లో తిరగాల్సిన దానివి - నా ఖర్మకొద్దీ నా కడుపున పుట్టి, తిండికూడా మాడిపోతున్నావ్' అని కంటతడి పెట్టేది. తను పనిచేసే వాళ్ళింట్లోంచి చాటుగా వాసన నూనె తెచ్చి తలకు వ్రాసేది. బియ్యపు పిండిలో సబ్బునీళ్ళు పోసి ఎండబెట్టి పౌడరు తయారు చేసేది.

ఈ పిల్లకూడా అందం చూసుకుందుకు అద్దం ముక్కకు గతిలేకుండా పెరగాలా? తనలాగా దుర్భర దారిద్ర్యము అనుభవించటానికేనా? ఈ పారిజాత పువ్వు తన కడుపున పుట్టటం ఎందుకు? శర్మను ఎంతో బ్రతిమాలింది.

'నీతోనే వుండిపోతాను శర్మా. నేను ఇంత పతనానికి ఎందుకు గురి అయ్యానో నీకు తెలియంది కాదు. నువ్వు అమిత ధనవంతుడివి. ఒక స్త్రీకోసరం కొంత ఇయ్యలేవా? నా పాపను నాలాగే పెరగనివ్వలేను శర్మా?' అన్నది గాద్గదికంగా.

'నేను గవర్నమెంటుడాక్టరుని. నువ్వు కులంలేనిదానివి. నాకు సంఘంలో గౌరవ ప్రతిపత్తులు కావాలి. నిన్నూ,

పాపని భరిస్తే ఎల్లాగయినా సంఘంలో తెలియకుండా జరగదు.'

'ఒహో, నువ్వూ సంఘంలో మనిషివే! మా పెరటి గుమ్మం దగ్గర గంటల తరబడి పడిగాపులు పడినప్పుడూ, 'పౌడర్లూ, స్నోలు' పంపించినప్పుడూ నీకు ఈ సంఘం అడ్డు రాలేదూ? సరేలే, నేను బ్రతక్కపోను. ఏనాటికయినా లిల్లీని నీ గౌరవప్రదమయిన జీవితానికి కంటకంలా తయారు చేయగలను.'

'హాఁ, స్త్రీ శపథం' అన్నాడు హేళనగా నవ్వుతూ డాక్టరు శర్మ.

లిల్లీ చేతులూ, కాళ్ళూ గింజుకుంటూ గట్టిగా ఏడవటం ప్రారంభించింది.

'పాప ఏడుస్తూంటే వినిపించుకోరేం?' అన్నాడు పై బెత్తుమీంచి సూటువాలా.

'మీరు అక్కడెప్పుడు చేరారు? నేను దిగిపోయారేమో అనుకున్నాను!' ఆశ్చర్యంగా అంది.

'నేను మీతో వస్తానన్నానుగా' అన్నాడు పళ్ళు పైకి పెట్టి నవ్వటానికి వృధా ప్రయత్నం చేస్తూ.

అతని ప్రక్కనున్న చిల్లుల బుట్టలో బత్తాయిలను చూసింది అచల. ఇప్పుడు లిల్లీ ఆకలితీర్చటం తన కర్తవ్యం.

'లిల్లీకి టెంపరేచర్ వచ్చిందండీ. తల్లిలేని పిల్ల' నిట్టూర్చింది అంతర్వేదనగా.

'అరరే! మరయితే ఏం ఇస్తారూ? గ్లూకోజ్ ఇవ్వనా?'

'వచ్చే స్టేషనులో బత్తాయిలయినా, టొమాటో అయినా జ్యూస్ ఇవ్వాలి' మృదువుగా, దీనంగా అన్నది.

అతను క్రిందికి దిగి తన దగ్గరున్న బత్తాయిలను ఇచ్చాడు దయగా.

'మీరేదైనా చదువుకున్నారా?' లిల్లీ ఆమె కూతురు కాదని తెలియగానే అతని మొదటి ప్రశ్న!

'ఆనర్సు పాసయ్యాను. బొంబేలో రిసెర్చికి ట్రై చేయమన్నాడు అన్నయ్య.' కళ్ళు గర్వంగా తిప్పింది. అతను ముగ్ధుడైనాడు. దాదరులోని శర్మ అత్తవారింట్లో తల్లిని వొదిలేసింది. అవసరం వచ్చినప్పుడు లిల్లీని తనదానిగా చేసుకోగల ధైర్యం ఆవిడకున్నది.

'నువ్వు జైలుకు పోతున్నావ్ అసిఫ్? నేనేమైపోనూ, ఇక్కడ యిలా వంటరిగా!' చేతులతో ముఖంకప్పుకొంది.

'దిగులుపడకు అంచల్! మనూరాం చూస్తాడు నీ ఏర్పాట్లన్నీ!' అన్నాడు సూటువాలా.

ఇతనేదో ఉన్నవాడని తను ప్రేమించినట్లుగావస్తే, ఇతను ఒక ఘరానా దొంగ అయి వూరుకున్నాడు! తన ఖర్మ! తనకందరు ఇలాంటి వాళ్ళే తటస్థపడుతున్నారు. తను ఏదయితే కోరుకున్నదో అది చేతికి అందబోతూ అంద కుండా పోతోంది. మళ్ళీవేట ప్రారంభం చెయ్యాలి. జీవిత మంతా తన కోరికలతోపాటు ప్రయాణం చెయ్యాల్సిందే కదూ! అసలు యుగయుగాలుగా వ్యక్తులు తమకోరికలకోసం పరుగెత్తుతూంటమే చరిత్ర అవుతున్నదేమో!...

ఇప్పుడు మళ్ళీ మొదటికొచ్చినది! ఈ వినోదు దారిద్ర్యం అనుభవించటానికే తను పుట్టలేదు. తను తాళి కట్టినభార్యకాదు. తనలాంటివాళ్లు ఒకరితో పాటు పడివుండ లేదు. వినోదయితే మరీగోల చేస్తున్నాడు.

'నిన్ను పవిత్రంగా ప్రేమించాను! నిన్ను వొదలలేను' అంటాడు.

చిత్రాలమీాద వచ్చిన డబ్బు కాన్వాసుకీ, టీకీ, సిగ రెట్లకీ చాలటంలేదు.

ఇరువయినాలుగు గంటలూ పార్కు వేపుకూడా పోవ టానికి లేకుండా ఇంట్లో తన కెదురుగా కూర్చోమంటాడు. తన ఇన్నేళ్ళ అనుభవంలో, తన చిన్ననాటి స్వప్నాలు తీర కుండానే గడిపివేసింది, ఒక లిల్లీ మాత్రం తను ఆశించినట్లు తండ్రి ధనంతో చదువుకుంటున్నది. ఇప్పుడు తన్ని ఎరుక పర్చుకుని దాని ప్రశాంత జీవిత సరస్సులో రాళ్ళు విసరటం అనవసరం. తన్ని అంతా దూషిస్తారు. మామూలు ఆడ వాళ్ళు తన్ని ఛీదరగా చూస్తారు! శ్రీమతి సంజయగా, శ్రీమతి వినోదు కుమారరాయ్‌గా కొంత మిథ్యా గౌరవా న్నైనా పొందకలిగింది. కాని తన దురదృష్టంకొద్దీ వాళ్లు నిర్ధనులైనారు. వీరాజీ కేసి చూసింది అచల. ఆ చూపులో సర్వమూా నివేదితమైనది వీరాజికి. అందులో అభ్యర్థన గోచరించింది.

'ఊఁ చెప్పు, వింటాము' అన్నాడు వీరాజీ. చంద్ర గమనాన్ని చూస్తూ. చంద్రుని వెన్నెల కెరటాల చివర్లని పలకరిస్తూంది.

'నేను ఇంక అన్వేషించలేను. మీరు నాకని ఒక కారూ, ఒక యిల్లు ఇచ్చారంటే నేను మీతోనే వుంటాను' అన్నది అచల, వీరాజీ చెవుల వెనుకగా నెరసిన జుట్టు చూస్తూ.

'అచ్ఛా! మమ్మల్ని ప్రేమించావన్న మాట చివరికి' అన్నాడు వీరాజీ యువకునిలా.

'ఆ మాట అనొద్దు మీరు! ప్రేమ కాదు ముఖ్యం - కోరికలు. నా కోరికలు తీరటానికి ఇరవయి ఏళ్ళ అన్వేషణ! అప్పుడే మీరు నాక్కనబడకూడదూ? కాలానికి ఎంత కసి మనుష్యులమీద' అన్నది.

'ఐతే ఏ మహారాజైనా నిన్ను సామ్రాజ్ఞిని చేస్తా నంటే మమ్మల్ని వదలిపోతావా అంచల్!' అన్నాడు, తన వేళ్ళ ఉంగరాలను సవరించుకుంటూ.

'చెప్పలేను. అయినా యీ రోజుల్లో మహారాజులు లేనూ లేరు; నాలో ఆ అందం మిగిలీలేదు. పదండి పోదాం!' అంటూ రోడ్డుమీద పార్కు చేయబడిన అతని కారు వెంపుకి వెళ్ళసాగింది అచల!